సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 27 । ఆగస్టు । 2023

రక్తచరిత్రకు 75 ఏళ్లు..



రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిన పోరాటాల పురిటి గడ్డ వీర బైరాన్‌పల్లి. మాతృభూమి విముక్తి కోసం పోరాడి ఎందరో యోధులు నేల కొరిగిన నెత్తుటి చరిత్రకు 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కథనం. 8లో



ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

ఆర్టీసీ బస్సులో ఓ మహిళకు సుఖ ప్రసవం జరిగిన సంఘటన జహీరాబాద్‌లో చోటు చేసుకుంది. మార్గమధ్యలో నొప్పులు రాగా డ్రైవర్.. మిర్జాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 8లో

10 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి లో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 10 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అలాగే ఆర్టీపీసీఆర్ టెస్టులు ఎనిమిది మందికి నిర్వహించిన్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

చార్జింగ్ స్టేషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: తెలంగాణా పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ స్టేషన్లు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ మాణిక్యం తెలిపారు. ఈ జిల్లాలో సుమారు 25, వికారాబాద్ జిల్లాలో సుమారు 5 స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. టీఎస్ రెడ్‌కో ఎంపిక చేసిన ఆపరేటర్లకు పదేళ్ల వరకు రెవెన్యూ, షేరింగ్ ఆధారితంగా ల్యాండ్‌ను కేటాయిస్తామని పేర్కొన్నారు. గైడ్ లైన్స్ ప్రకారంగా సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకొని నిర్వహించవలసి ఉంటుందని వివరించారు. ఆసక్తి గల వారు వెబ్‌సైట్ www.tsredco.telangana.gov.in లేదా హెడ్ ఆఫీస్‌లో సంప్రదించాలని సూచించారు. లేకుంటే దరఖాస్తులను తీసుకొని వచ్చేనెల 9న హైదరాబాద్‌లో జరిగే కేటాయింపుల ప్రక్రియలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

6న మెజిస్టీరియల్ ఎంక్వయిరీ

ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్: జిల్లా జైల్లో విచారణ ఖైదీ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సెప్టెంబర్ 6వ తేదీ ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ ఎంక్వయిరీ నిర్వహించనున్నట్లు సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. ఖైదీ తెల్లబాను చందర్ (24), 2022 ఫిబ్రవరి 14న ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ ఘటనపై డివిజనల్ అధికారి కార్యాలయంలో ఎంక్వయిరీ ఉంటుందని పేర్కొన్నారు. వాస్తవాలు తెలిసిన వారు హాజరై వాంగ్మూలాన్ని ఇవ్వాల్సిందిగా తెలిపారు.

గార్డెన్ దొరకు ఎమ్మెల్యే మాణిక్‌రావు నివాళి



గార్డెన్ దొర విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన గార్డెన్ దొర 31వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు శనివారం నివాళులు అర్పించారు. పట్టణంలోని ఎంఆర్ హెచ్‌ఎస్ స్కూల్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పట్లో దొర అన్నిహంగులతో కూడిన భవనాలు కట్టించి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేశారన్నారు. తాను ఇంకా ఎంతోమంది ఇక్కడే చదవామని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో రెవ జాన్‌వెస్లీ, జిల్లా సెక్రటరీ రవికుమార్, పలు గ్రామాల పాస్టర్లు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మొహియోద్దీన్, నాయకులు ఇజ్రాయిల్ బాబీ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఆర్‌సీఓ విచారణ



విచారణ చేస్తున్న ఆర్‌సీఓ భీమయ్య

నారాయణఖేడ్: మండలం జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకులంలో రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్సీవో) భీమయ్య శనివారం విచారణ జరిపారు. కాస్మొటిక్ చార్జీల్లో కోత, ప్రిన్సిపాల్, అధ్యాపకుడి వేధింపులకు గురిచేస్తున్నారని విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారితో, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమస్యలు తెలిపేందుకు యత్నించినా పట్టించుకోలేదని పేరెంట్స్ కమిటీ బాధ్యుడు బంగారు రాజు, శంకర్, సంజీవ్‌కుమార్, నర్సింహులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ చీఫ్ కోఆర్డినేటర్‌గా చంద్రశేఖర్



ఎ.చంద్రశేఖర్



ఎస్.గిరిధర్ రెడ్డి

జహీరాబాద్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ముఖ్య సమన్వయకర్తగా మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, సమన్వయకర్తగా ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్ రెడ్డి నియమితులయ్యారు. సభ్యులుగా నాల్‌కల్ మాజీ జెడ్పీటీసీ కె.భాస్కర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ ఖాజామియా, ఎంపీపీ ఉపాధ్యక్షుడు వి.రాములు, అల్లీపూర్ మాజీ ఎంపీటీసీ జి.అశోక్ కుమార్ నియమితులయ్యారు.

సంగారెడ్డి టికెట్‌కు పోటాపోటీ!



జగ్గారెడ్డి సహా నలుగురు దరఖాస్తు
- రేసులో దామోదర అనుచరుడు
- సొంత పార్టీలోనే జగ్గన్నకు పోటీ
- ఆసక్తికరంగా హస్తం రాజకీయాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్‌లో సంగారెడ్డి అంటే జగ్గారెడ్డి అన్నట్లుగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారింది ఈ అసెంబ్లీ స్థానం టికెట్ కోసం పోటాపోటీ నెలకొంది. తనకు ఎదురు లేదనుకున్న చోట తొలిసారిగా నలుగురు దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. మాజీ ఉపముఖ్యమంత్రి, సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితుడు దామోదర రాజనర్సింహ ప్రధాన అనుచరుడు, మరికొందరు, జగ్గారెడ్డి తరపున ఆయన సతీమణి నిర్మలా దరఖాస్తు చేసుకున్నారు. అయితే టీడీపీలో వివిధ పోస్టుల్లో పనిచేసిన సంగమేశ్వర్, రాజనర్సింహ వెంటే ఉంటున్నారు. డీసీసీ అధ్యక్ష పదవి విషయంలోనూ పేరు తెరపైకి రాగా కేటాయించాలని దామోదర సూచించినట్లు అప్పట్లో పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. ఇప్పుడు ఈ విషయమై ఆసక్తికరంగా మారింది.

రేవంత్ వర్గం నుంచి కూడా

పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాత్తిరెడ్డిపల్లికి చెందిన పొన్న శంకర్‌రెడ్డి అధిష్టానం పిలుపునిచ్చిన కార్యక్రమాలను ప్రత్యేకంగా చేస్తుంటారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వర్గానికి చెందిన అనుచరుడిగా పేరుంది. ఇప్పుడు ఆయన కూడా దరఖాస్తు చేసుకున్నారు.

మరో ఇద్దరు

జిల్లా కేంద్రానికి చెందిన అడ్వొకేట్ ఎంఏ ముఖీం, తెలంగాణ జనసమితి (టీజేఎస్) నాయకుడు తుల్జారెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ముఖీం.. మన టీన్ ఫౌండేషన్ అనే సంస్థ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కాగా టీజేఎస్ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు లేదా విలీనమయ్యే అవకాశాలున్నాయని సమాచారం.

తొలిసారిగా..

తొలిసారిగా సంగారెడ్డి టికెట్ కోసం పలువురు నేతలు పోటీ పడుతుండటం ఆసక్తికరంగా మారింది. ఇటీవల జగ్గారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై అసమ్మతి గళం వినిపించి, పలుమార్లు మంత్రి కేటీఆర్‌ను కలవడంతో గులాబీ కండువా కప్పుకోవడం ఖాయమైందనే అభిప్రాయం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాల్లో వ్యక్తమైంది. పార్టీలో చేర్చుకోవద్దని, మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కే టికెట్ ఇవ్వాలని నియోజకవర్గానికి చెందిన గులాబీ శ్రేణులంతా సమావేశమయ్యారు. హైదరాబాద్ వెళ్లి మంత్రి హరీశ్ రావునూ కలిశారు. తాజాగా బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం ప్రభాకర్‌కే దక్కింది. దీంతో జగ్గన్న అధికార పార్టీలోకి చేరుతున్నారనే ప్రచారానికి తెరపడింది. తాను పార్టీ మారడం లేదని, రాహుల్‌గాంధీతోనే రాజకీయ ప్రయాణం ఉంటుందని వివరణ ఇచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు నాయకులు దరఖాస్తు చేసుకోవడం పార్టీ అంతర్గత వర్గాల్లో చర్చనీయాంశమైంది.



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శరత్

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

కలెక్టర్‌కు సీఈఓ వికాస్‌రాజ్ సూచన

సంగారెడ్డి టౌన్: తుది ఓటరు జాబితా పక్కాగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్ రాజ్ కలెక్టర్‌కు సూచించారు. ముఖ్యంగా డబుల్ ఎంట్రీ, బోగస్ పేర్లు లేకుండా బీఎల్‌ఓ నుంచి ఈఆర్‌ఓ స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. పారదర్శకంగా రూపొందేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. రెండేసి పేర్లుంటే నోటీసులు జారీ చేయాలన్నారు. పక్షం రోజుల్లోగా సమాధానం ఇవ్వకుంటే విచారణ చేయాలని సూచించారు. అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నమోదు, మార్పులు చేర్పుల కోసం పోలింగ్ బూత్‌లవారీగా ప్రత్యేక శిబిరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని చెప్పారు. ఏదైనా పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల సంఖ్యలో రెండు శాతానికి మించి పేర్లు తొలగిస్తే ఈఆర్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ నగేష్, ఈఆర్‌ఓలు, ఏ ఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: ఆర్డీవో శ్రీనివాస్

హత్నూర (సంగారెడ్డి): 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బీఎల్‌ఓసీ ప్రత్యేకంగా నిర్వహించిన క్యాంపును తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తిరిగి ఓటు హక్కు ఉందో? లేదో సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక దృష్టి పెట్టాలని విధుల పట్ల నిర్లక్ష్యం వస్తే బీఎల్‌ఓలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్, సర్పంచ్ వెంకటేశం, గ్రామ కార్యదర్శి నరసింహరావు, వార్డు సభ్యులు సతీష్, అజీజ్ తదితరులున్నారు.

సదాశివపేటలో..

సదాశివపేట(సంగారెడ్డి): ఓటరు నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓలు చురుకైన పాత్ర పోషించాలని సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని రవీంద్ర మోడల్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. నూతన ఓటరు నమోదు గురించి బీఎల్‌ఓలను వివరాలు అడిగి తెలుసుక్నురు. యువతి యువకులందరు ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఆర్‌ఐ గణేష్ , బీఎల్‌ఓలు పాల్గొన్నారు,

ఏఎన్‌ఎంల వినూత్న నిరసన



ఉరితాడు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

కొండాపూర్(సంగారెడ్డి): ఏఎన్‌ఎంల పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని శనివారం కలెక్టరేట్ వద్ద సెకండ్ ఏఎన్‌ఎంలు మెడకు ఉరి వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలన్నారు. కేవలం రెగ్యులర్ చేయమని మాత్రమే అడుగుతున్నామన్నారు. చేయని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్యామల, లక్ష్మి, బాలమణి, పుష్పలత, స్వప్న, లక్ష్మి, వనిత, రోజా తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల(కేజీబీవీ)లో శనివారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. రికార్డు పరిశీలనతోపాటు కిచెన్ గార్డెన్, వంటశాల, సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందుతుందా? లేదా అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి పాల్గొన్నారు.



రికార్డు పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

ఆరోగ్యకర పోటీయే మేలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాజకీయాల్లో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ ఫెయిర్‌కు ఆయన హాజరై మాట్లాడారు. యువత పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. స్వయం ఉపాధితో పైకి వచ్చినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకేసారి 115 అసెంబ్లీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించడం గొప్ప విషయం అన్నారు. కాంగ్రెస్ దరఖాస్తులను ఆహ్వానించే కొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. ఏదేమైనప్పటికీ రాజకీయాల్లో ఆరోగ్యకర పోటీ ఉండాలని సూచించారు. తన రాజకీయ భవిష్యత్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.



లక్ష్మీనారాయణకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

ఐక్య పోరాటాలే శరణ్యం

- అప్పుడే సమస్యలు పరిష్కారం : సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేష్

హత్నూర (సంగారెడ్డి): ఐక్య పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ మల్లేశం అన్నారు. శనివారం మండలంలోని గుండ్ల మాచనూర్ గ్రామశివారులోని ఆర్బి ఫార్మా ల్యాబ్ పరిశ్రమలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మల్లేశం మాట్లాడుతూ వీరికి అండగా సంఘం ఉంటుందని భరోసానిచ్చారు. అనేక కంపెనీలలో వేతన ఒప్పందాలు సాధించామన్నారు. యూనియన్ అన్ని సౌకర్యాలను ఇప్పిస్తోందన్నారు. అందరూ కలిసి ఉంటే ఏదైనా సాధించవచ్చని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు కే రాజయ్య మాట్లాడుతూ కార్మికుల కోసం నిత్యం కొట్లాడుతున్న సంఘం తమదేనన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు శ్రీధర్ గౌడ్, కొండల్ రెడ్డి పరిశ్రమ నాయకులు శ్రీరాములు, భరత్, తిరుమల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రెయిన్ పైప్‌లతో ఆరుతడి

రెయిన్ పైప్‌లతో ఆరుతడి పంటలకు నీరందించి రక్షించుకొనే చర్యల్లో రైతులు నిమగ్నమయ్యారు. సాగునీటి సదుపాయం ఉన్న కొంతమంది రైతులు సోయా, పత్తి, కంది, మొక్కజొన్న పంటలకు రెయిన్ పైప్‌లతో నీరందిస్తున్నారు. కంగ్టి మండలంలోని చాప్టా శివారులో శనివారం ఓ రైతు నీరు అందిస్తున్నాడు.

\- కంగ్టి (నారాయణఖేడ్)



సోయా పంటకు రెయిన్ పైప్‌తో అందిస్తున్న నీరు

హరితహారంలో భాగస్వాములు కండి

- కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే క్రాంతికిరణ్
- సింగూరు ప్రాజెక్టు వద్ద సంపదవనంలో హరితహారం కార్యక్రమం

పుల్‌కల్(అందోల్): మొక్కల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ శరత్, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం సింగూరు ప్రాజెక్టు వద్ద మూడున్నర ఎకరాల సంపద వనంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెట్లతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాడుతోందన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో, పట్టణంలో పల్లె, బృహత్ ప్రకృతి వనాలు, పార్కులను ఏర్పాటు చేస్తోందన్నారు. వజ్రోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. జిల్లాలో 6.30 లక్షలను నాటుతున్నామన్నారు. పదేళ్లలో జిల్లాలో 9.36 కోట్లు నాటామని గుర్తు చేశారు. ప్రాజెక్టు వద్ద గతంలో నాటినవి ఇవాళ వనాలుగా మరాయని తెలిపారు. జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ మాట్లాడుతూ యువత, ప్రజలు స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చైతన్య విజయ్ భాస్కర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, నీటి పారుదల శాఖ ఎస్‌ఈ మురళీధర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్ రావు, ఆర్డీఓ పాండు, డీఎఫ్ఓ శ్రీధర్‌రావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ భాస్కర్ కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, సర్పంచ్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి మొక్కనూ సంరక్షించుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న అన్నారు. శనివారం హరితహారంలో భాగంగా మండలంలోని హత్నూర, నస్తీపూర్, దౌల్తాబాద్‌తోపాటు పలు గ్రామాల్లో ఎంపీపీ నర్సింలుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఖాళీ స్థలాల్లో నాటి సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమాలలో ఎంపీడీవో శారదా దేవి, ఎంపీఓ సువర్ణ, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

గొర్రెలను సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న గొర్రెలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న, ఎంపీపీ అధ్యక్షుడు నర్సింలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో రెండో విడతగా 12 గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా డైరెక్టర్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



నస్తీపూర్‌లో మొక్కలు నాటుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ శరత్

ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి టౌన్: ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు చేర్పులకు అవకాశం కల్పిస్తూ పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ నెల 26, 27వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్న సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శరత్ శనివారం పలుచోట్ల ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పట్టణంలోని నంబర్ 80, గంగోజీపేట పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి నిర్వహణ తీరుతెన్నులు పరిశీలించారు. బీఎల్‌ఓ లు, ఎన్నికల అధికారులు అందుబాటులో ఉన్నారా? అని ఆరా తీశారు. ఓటరు జాబితాలను పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేసి, ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల వివరాలను పరిశీలించారు. అప్పటి వరకు ఎంత మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నారు? ఎన్ని ఫారం 6లు, ఫారం 8లు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. శిబిరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు.



సంగారెడ్డిలో...

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం


బస్సులో ప్రసవించిన మహిళ, బిడ్డతో నర్సు

జహీరాబాద్ టౌన్/న్యాల్‌కల్(జహీరాబాద్): ఆర్టీసీ బస్సులో ఓ మహిళ సుఖ ప్రసవం జరిగిన సంఘటన జహీరాబాద్‌లో చోటు చేసుకుంది. డిపో మేనేజర్ నారాయణ వివరాలు. పాట్‌పల్లి గ్రామానికి చెందిన హాజీ పాషా భార్య జరీనా బేగంకు పురిటి నొప్పులు వచ్చాయి. ప్రసవం కోసం బీదర్ ఆసుపత్రికి వెళ్లడానికి శుక్రవారం రాత్రి సహాయకులతో కలిసి జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు పట్టణం దాటగానే ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. బస్సు డ్రైవర్ ఆనందం, కండక్టర్ కరుణాకర్ మార్గమధ్యలో ఉన్న మిర్జాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి బస్సును తరలించారు. నర్స్ సుధారాణిని బస్సు వద్దకు తీసుకుని వచ్చేలోపు మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

బియ్యం అక్రమ నిల్వలు పట్టివేత


బియ్యం అక్రమ నిల్వలను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

గజ్వేల్: మండల పరిధి బయ్యారం చౌరస్తాలోని శారదా రైస్ ఇండస్ట్రీస్‌లో అక్రమంగా నిల్వ ఉన్న బియ్యాన్ని శుక్రవారం రాత్రి గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం తీసుకొచ్చి రీసైక్లింగ్ చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు అందింది. ఈ మేరకు దాడి చేసి 22 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. డీఎస్‌ఓ తనూజకు సమాచారమిచ్చి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: సాకి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ అక్బర్‌ఖాన్ వివరాలు. పట్టణంలోని సాకి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తచరిత్రకు 75 ఏళ్లు..

- భైరాన్‌పల్లిలో జలియన్‌వాలాబాగ్‌ను మించిన నరమేధం
- రజాకార్ల దాడిలో 118 మంది గ్రామస్తుల బలి
- అమరుల కుటుంబాలకు దక్కని గుర్తింపు


అమరవీరుల స్తూపం

రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిన పోరాటాల పురిటి గడ్డ వీర భైరాన్‌పల్లి. అన్యాయాలపై గ్రామంలోని పిల్లల నుంచి పడచు యువతుల వరకు తిరుగుబాటు చేశారు. గడ్డి కోసిన చేతులు కొడవళ్లు పట్టాయి. అన్నం వండిన చేతులు బందూక్‌లు పట్టాయి. రజాకార్ల దుర్నీతికి వ్యతిరేకంగా పిడికిలెత్తాయి. మాతృభూమి విముక్తి కోసం పోరాడి ఎందరో యోధులు నేలకొరిగిన నెత్తుటి చరిత్రకు నేటితో 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

మద్దూరు(హుస్నాబాద్): జలియన్‌వాలాబాగ్ సంఘటనని తలపించిన వీరాభైరాన్‌పల్లి నెత్తుటి చరిత్రకు ఈనెల 27వ తేదీతో 75 ఏళ్లు నిండాయి. రజాకార్ల పాశవిక దాడులను ఎదిరించి పోరాడిన భైరాన్‌పల్లి వీరుల ప్రాణత్యాగం మరువలేనిది. మాతృభూమి విముక్తి కోసం 118 మంది యోధులు నేలకొరిగారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ప్రజలు స్వేచ్ఛా వాయువులను పీలుస్తుండగా, నిజాం రాజు గుప్పిట్లో ఉన్న తెలంగాణ ప్రాంతం మాత్రం రజాకార్ల దురాగతాలకు బలవుతూ బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీసింది.

1948 ఆగస్టు 27వ తేది వేకువజామున 4 గంటల ప్రాంతం. నిజాం సైన్యాధిపతి ఖాసీం రజ్వీ సైనికులు(రజాకార్లు) భైరాన్‌పల్లి గ్రామంలో తమకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు 1,200 మంది సైన్యంతో అర్ధరాత్రి 12 గంటలకు పది ట్రక్‌లతో జనగామ నుంచి బయలుదేరారు. రాత్రి 2 గంటలకు లద్నూరు గ్రామానికి చేరుకొని 3 గంటలకు భైరాన్‌పల్లి గ్రామాన్ని చుట్టుముట్టారు. తెల్లవారుజామున 4 గంటలకు ఉల్లెంగం(వడ్ల) నర్సయ్య గ్రామ చివరకు బహిర్భూమికి వెళ్లడంతో మాటువేసిన రజాకార్లు పట్టుకున్నారు. గ్రామంలోని బురుజు వద్దకు దారి చూపాలని వెంట పెట్టుకొని నడుస్తుండగా వారిని నెట్టేసి రజాకార్లు గ్రామాన్ని చుట్టుముట్టారంటూ పెద్దగా కేకలు వేస్తూ పరుగులు పెట్టాడు. దళ కమాండర్ ఇమ్మడి రాజారెడ్డి ప్రజలంతా తగిన రక్షణలో ఉండాలని కోరుతూ నగారా మోగించారు. గ్రామస్తులంతా బురుజు వద్ద గడీలోకి పరుగులు తీశారు. యువకులు గ్రామానికి నాలుగు వైపులా కాపు కాసి శత్రువులను గ్రామంలోకి రాకుండా చూడాలని హెచ్చరికలు జారీ చేశారు. గ్రామాన్ని చుట్టుముట్టిన రజాకార్లను తరిమి వేయడానికి బురుజు పై నుంచి కాల్పులు ప్రారంభించారు. గ్రామస్తులు ఏ వైపు నుంచి కాల్పులు జరుపుతున్నారో చూసి రజాకార్లు కూడా కాల్పులు ప్రారంభించారు. కాల్పులు కొనసాగుతున్న సమయంలో బురుజు పైనున్న మందుగుండు సామగ్రిలో నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. అవి పేలి బురుజుపై ఉన్నవారు నేలకొరిగారు. బురుజు పై నుంచి కాల్పులు ఆగిపోవడంతో రజాకార్లు గ్రామంలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్లు చంపారు. ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ..బురుజుపైనున్న కొందరిని కిందకు దింపి వరుసగా నిల్చోబెట్టి దారుణంగా కాల్చి చంపి రక్తదాహాన్ని తీర్చుకున్నారు. గ్రామం మొత్తాన్ని వల్లకాడుగా మార్చారు.బుజురు నుంచి భయంతో పరుగులు పెడుతున్న మహిళలను వెంటాడి పట్టుకున్నారు. అనేక మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనలు రజాకారుల రాక్షసత్వానికి నిదర్శనం.

శవాల చుట్టూ బతుకమ్మ ఆట

భైరాన్‌పల్లిలో ఆగస్టు 27న రజాకార్ల దాడిలో చనిపోయిన శాలను గుట్టలుగా పడేశారు. మహిళలను వివస్త్రలను చేసి వాటి చుట్టూ బతుక మ్మ ఆడించి పైశాచిక ఆనందాన్ని పొందారు. ఆనాటి సంఘటనను గుర్తుచేసుకుంటూ భైరాన్‌పల్లి గ్రామస్తులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ దుర్ఘటనలో 118 మంది గ్రామస్తులు వీరమరణం పొందారు.

పోరాటానికి గుర్తింపు కరువు

జలియన్‌వాలాబాగ్ ఘటనను మించిన భైరాన్‌పల్లి పోరాటాన్ని ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం శోచనీయమని సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల కుటుంబాలను ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు ఆదుకోలేదని పలువురు చెబుతున్నారు. నేటికీ ఆ కుటుంబాలు దయనీయ స్థితిలో కాలం వెల్లదీస్తున్నాయని, స్వరాష్ట్రం కోసం సాగిన తొలి, మలి దశ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన వీర భైరాన్‌పల్లి పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు.

ప్రాణాలను అడ్డుపెట్టి..



దొంగ దెబ్బ తీసేందుకు రజాకార్లు గ్రామంలోకి ప్రవేశించడానికి ప్రయత్నం చేశారు. ప్రాణాలను అడ్డుపెట్టి వారి కీచక చర్యలను ఎదుర్కొన్నాం. నేటికీ ఆనాటి రజాకార్ల దుశ్చర్యలు కళ్ల ఎదుట కదలాడుతున్నాయి.

– వెంకట్‌రెడ్డి, సమరయోధుడు, భైరాన్‌పల్లి

సమరయోధుల కుటుంబాలను ఆదుకోవాలి



నిజాం సైన్యాధిపతి ఖాసీం రజ్వీ పైశాచిక దాడులను ఎదుర్కొని చరిత్ర సృష్టించిన భైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. జలియన్‌వాలాబాగ్ ఘటనను పోలిన ఉదంతానికి ఎదురొడ్డి ఎందరో ప్రాణాలు కోల్పోయిన, పోరాటంలో పాల్గొన్న వారి కుటుంబాలను ఆదుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భైరాన్‌పల్లి చరిత్రను మరిచాయి. ఇప్పటికైనా భైరాన్‌పల్లి చరిత్రను గుర్తించాలి.

– బండి శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ (భైరాన్‌పల్లి)


భైరాన్‌పల్లి చరిత్రకు నిదర్శనమైన బురుజు

ఆచరణకు సాధ్యం కాని హామీలిస్తూ మోసం

మహారాష్ట్రలోని వార్ధా ఎమ్మెల్యే పంకజ్ రాజేష్ బోయర్


మాట్లాడుతున్న పంకజ్ రాజేష్ బోయర్

కొండపాక(గజ్వేల్): అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని, అందుకనుగుణంగా కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని మహారాష్ట్రలోని వార్ధా ఎమ్మెల్యే పంకజ్ రాజేష్ బోయర్ పేర్కొన్నారు. కొండపాక మండలం దుద్దెడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంకజ్ రాజేష్ మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ ఆచరణకు సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మోసగిస్తున్న తీరును ప్రజలకు వివరించాలన్నారు. లక్షల కోట్లతో ప్రవేశ పెడుతున్న పథకాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇస్తూ సంక్షేమ లక్ష్యం నీరుగార్చుతున్నారన్నారు. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తామే ప్రవేశ పెడుతున్నామని కేసీఆర్ సర్కార్ చెప్పుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో సాగుతున్న కుటుంబ పాలనకు స్వస్తి పలికేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీతో బీజేపీకి ఎలాంటి పొత్తులు ఉండవని, కాంగ్రెస్ కావాలనే దుష్ప్రచారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి పూదూరి నందన్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు ఎల్లు రాంరెడ్డి, దారం గురువారెడ్డి, సీనియర్ నాయకులు కప్పర ప్రసాద్, నలగామ శ్రీనివాస్, రాములు, మహేష్, అనూష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృత్యువాత

- అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు
- నష్ట పరిహారం కోసం ఆందోళన


కరెంట్ షాక్ తో మృతిచెందిన నర్సింలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి చెందిన సంఘటన చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు వివరాలు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన వెలిమెల శ్రీకాంత్ శివంపేట గ్రామ శివారులో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిని గ్రామానికి చెందిన మిరియాల వెంకటేశం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పశువుల సంరక్షణ కోసం వెంకటేశం పుల్కల్ మండలం ఇసోజీపేట గ్రామానికి చెందిన మంగలి నర్సింలు (55)ను జీతానికి కుదుర్చుకున్నాడు. ఏడాదిన్నరగా ఉంటున్న నర్సింలు ఎప్పటిలాగే పచ్చిగడ్డి కోసం పొలానికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా కరెంట్ షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు.

నర్సింలు మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాళ్లకు గమ్ షూ ధరించి ఉండగా విద్యుత్ షాక్ ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. అలాగే చేతిలోని కొడవలి నోట్లోకి ఎలా వెళ్లిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన ఎస్‌ఐ విజయ్‌కుమార్ గౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తుండగా బంధువులు అడ్డుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని మొండికేశారు. దీంతో భూమి యజమాని శ్రీకాంత్ కుటుంబసభ్యులతో పాటు కౌలుదారు వెంకటేశంతో ఎక్స్‌గ్రేషియా విషయమై చర్చలు జరిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇంటిలో గంజాయి మొక్కలు స్వాధీనం

పోలీసుల అదుపులో నిందితుడు


గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ ఇంటి ఆవరణంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాలు. గ్రామానికి చెందిన యాళ్ల రమేష్ ఇంటి ఆవరణంలో నాలుగు గంజాయి మొక్కలు ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్ సమక్షంలో పంచనామా నిర్వహించి, నాలుగు మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర వివేక్ తెలిపారు. అయితే నిందితుడు మాత్రం తన ఇంటి ముందు గంజాయి మొక్కలు పెరుగుతున్నట్లు తనకు తెలియదని, అవి ఎన్నడూ చూడలేదని చెబుతున్నాడు. మొక్కలను ఎవరైనా నాటారా..? లేదా సహజ సిద్ధంగా పెరిగాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నిందితుడు 'గౌరవెల్లి' భూ నిర్వాసితుడు

గుడాటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగుపల్లెకు చెందిన రమేష్ ఇల్లు, భూమి గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురైంది. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో పరిహారం తీసుకున్న తర్వాత అంతక్కపేట గ్రామంలో ఏడాది కిందట ఓ ఇల్లు, గ్రామశివారులో సుమారు 8 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇల్లు కొనుగోలు చేసుకున్నప్పటి నుంచి ఆవరణంలో రకరకాల మొక్కలు పెరుగుతున్నాయని, గంజాయి మొక్కలు ఎలా ఉంటాయో తమకు తెలియదని రమేష్ కుటుంబ సభ్యులు వాదిస్తున్నారు. అలాగే ఇరుగుపొరుగు వాళ్లు కూడా ఇదే విషయాన్ని తెలుపుతున్నారు.

కాల్మొక్త సార్.. వదిలిపెట్టండి

మాకు అవి గంజాయి మొక్కలని తెలియదు.. కాల్మొక్త సార్.. వదిలిపెట్టండి అంటూ నిందితుడి కుటుంబసభ్యులు తహసీల్దార్‌ను వేడుకున్నారు. మీకు తెలియకుండానే నాలుగు గంజాయి మొక్కలు సుమారు నాలుగైదు మీటర్ల ఎత్తులో ఎలా పెరిగాయా..? అని నిలదీశారు.

గత చరిత్రపై ఆరా..

గంజాయి అలవాటు, కేసులు తదితర కోణాలపై నిందితుడి గత చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఇటీవల గౌరవెల్లి, ముంపు గుడాటిపల్లి గ్రామాల పరిధిలో గంజాయి మత్తులో ఇద్దరు యువకులు బ్లేడ్లతో మెడ కోసుకున్న సంఘటన చోటుచేసుకున్న విషయం విధితమే. ఈ క్రమంలో నిందితుడు కూడా ముంపు ప్రాంతం నుంచే రావడంతో పోలీసులు పలు కోణాలలో ఆరా తీస్తున్నారు.

అనుమానితులు వీరే..!




జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లిగ్రామ శివారులోని మేడలమ్మ తల్లి దేవాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా విచారణ జరిపారు. ఇద్దరు అనుమానిత వ్యక్తుల ఫొటోలను శనివారం విడుదల చేశారు. వీరిని గుర్తుపడితే 8712656751 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కోరారు. చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

వర్గల్(గజ్వేల్): కాలకృత్యాలకు వెళ్లిన మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు పుస్తెల తాడును తెంపుకుని ఉడాయించాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున వర్గల్ మండలం వేలూరులో జరిగింది. గౌరారం ఎస్సై విజయభాస్కర్ వివరాలు. వేలూరుకు చెందిన నల్లనాగుల అనురాధ శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో కాలకృత్యాల కోసం నిద్రలేచింది. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగుడు ఆమె మెడలో నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకుని ఉడాయించాడు. ఆమె తేరుకుని గట్టిగా అరవడంతో కుటుంబసభ్యులు నిద్రలేచారు. వారు బయటకు వచ్చి చూసేలోగా అప్పటికే దొంగ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి చైన్‌స్నాచింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

యువకుడికి గాయాలు

తొగుట(దుబ్బాక): విద్యుత్ అధికారి నిర్లక్ష్యంతో యువకుడు కరెంట్ షాక్‌కు గురైన సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని లింగాపూర్ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాలు. గ్రామ శివారులోని ఓ కోళ్ల ఫారం యజమాని కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారి ఉదయం కరెంట్ తొలగించాడు. సాయంత్రం కరెంట్‌ను పునరుద్ధరించాలని కోరగా సదరు అధికారి తుక్కాపూర్‌కు చెందిన బోయిని కిషన్ (26)ను తీసుకెళ్లి 11కేవీ విద్యుత్ స్తంభం ఎక్కించాడు. సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకోకపోవడంతో యువకుడు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. నడుము విరిగి తీవ్రంగా గాయపడటంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి


మృతుడు శంకర్

చేగుంట(తూప్రాన్) గుర్తు తెలియని వాహనం ఢీకొని టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన చేగుంట శివారులోని రెడ్డిపల్లి బైపాస్ వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాలు. కామారెడ్డి జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన కాసం శంకర్(63) టీవీఎస్‌పై హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో చేగుంట శివారులోని రెడ్డిపల్లి బైపాస్ వద్ద వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ హరీష్ తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని యువకుడు..


శ్రీకాంత్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఆటో, బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం కౌడిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి వివరాలు. కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బోండ్ల శ్రీకాంత్(25) శుక్రవారం రాత్రి బైక్ మీద కౌడిపల్లి వస్తుండగా వెల్మకన్న వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుని తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హైడ్రాలిక్ మీద పడి డ్రైవర్..


దేవయ్య(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): ట్రాక్టర్ హైడ్రాలిక్ మీద పడడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి నిజాంపేట మండలం బాచేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన అంకుంపేట దేవయ్య(28) ట్రాక్టర్ ద్వారా మట్టి వేసే పనులు చేస్తున్నారు. ట్రాక్టర్ హైడ్రాలిక్ చెడిపోవడంతో మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తలపై పడింది. తీవ్ర గాయం కావడంతో స్థానికులు నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో దేవయ్య చనిపోయాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కాలంతో పనిలేకుండా చెరువుల్లోకి నీరు

ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


మంత్రికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న కురుమ సంఘం సభ్యులు

సిద్దిపేటరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, రెడ్డి కులసంఘ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, డంప్‌యార్డు, వైకుంఠధామం ప్రారంభోత్సవాలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. కొద్దిసేపు గుర్రం బండెక్కి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా చిన్న గ్రామమైన రాంపూర్ లో యాసంగి పంట 18 లారీల ధాన్యం పండించారని పేర్కొన్నారు. కాలంతో సంబంధం లేకుండా కాలువల ద్వారా చెరువుల్లోకి సీఎం కేసీఆర్ నీటిని తీసుకువచ్చారన్నారు. కడుపులో బిడ్డ నుంచి అందరికీ ప్రభుత్వమే సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. గ్రామంలో సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు 42 మందికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అంజన్న గుడి నిర్మాణానికి సాయం అందిస్తానన్నారు. గ్రామ డబుల్ రోడ్ కోసం రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. గ్రామంలోని ఓట్లన్నీ ఈసారి బీఆర్‌ఎస్‌కే వేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, యాదయ్య, భిక్షపతి, పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోనే మోడల్ పోలీస్ స్టేషన్‌గా సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించనున్నట్లు మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణంలోని రంగధాంపల్లి శివారులో త్రీ టౌన్ నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. రెండు అంతస్తుల్లో రూ.4.44కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు, వంగ నాగిరెడ్డి, రాజనర్సు, పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు

సిద్దిపేటజోన్: భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక టీటీసీ భవన్‌లో 233 మంది దివ్యాంగులకు రూ.17లక్షల విలువైన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేటలో భవిత సెంటర్ సైకోవేటర్ పార్క్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ కు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీల అందజేత

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిధిలోని చిన్నకోడూర్, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని కుల సంఘ భవనాలకు రూ.97 లక్షల మేర ప్రొసీడింగ్ కాపీలు మంత్రి అందించారు. అదేవిధంగా హాస్టల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో మంత్రి పాల్గొని నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ పనితీరు, పురోగతిపై సమీక్షించారు. జిల్లా ఎస్సీ అభివద్ధి శాఖ అధికారి కవిత, బీసీ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులు


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

దుబ్బాక: హీరో సుమన్ చేతుల మీదుగా దుబ్బాక విద్యార్థులు కరాటే బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు అందుకున్నారని ఆర్ట్ ఆఫ్ డిఫెన్స్ అకాడమీ ఇండియా ఫౌండర్ అండ్ స్టైల్ చీఫ్ మాస్టర్ బురానీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని మణికొండలోని కేఎం గుప్తా హోటల్లో సర్టిఫికెట్లు అందజేశారని చెప్పారు. వీటిని అందుకున్న వారిలో లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులు హర్షవర్ధన్, శ్రీకర్‌గౌడ్, గౌతమి, దుబ్బాక గాయత్రి వివేకానంద విద్యాలయం ఆకాష్, నవనీత్, సిద్దిపేట శ్రీచైతన్య స్కూల్ మనస్విని, అక్షయ, లాస్య, దీప్తి, అంబిటస్ విద్యార్థులు వర్షిణిరెడ్డి, యశ్వంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు.